## క్లుప్తంగా

### ఆళ్లపల్లిలో 5వ ఎంపీటీసీ స్థానంగా నడిమిగూడెం

**గుండాల:** ఆళ్లపల్లి మండలంలో ఐదో ఎంపీటీసీ స్థానంగా నడిమిగుడెం గ్రామాన్ని గుర్తించారు. ఆళ్లపల్లి మండలంలో గత ఎన్నికల్లో నాలుగు ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. ఇప్పుడు నడిమిగూడెం, అడవిరామారం గ్రామ పంచాయతీలను కలుపుకుని నూతన ఎంపీటీసీ స్థానంగా గుర్తించినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం ఆళ్లపల్లి, మర్కోడు, రాఘవపురం, అనంతోగుతో పాటు నడిమిగూడెం కలిపి ఐదు స్థానాలు ఉన్నట్లు వెల్లడించారు.

### ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ బాధ్యులు

**మణుగూరురూరల్:** మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన కారం సీతారాములు ప్రమాదవశాత్తు కరెంట్ స్తంభంపై నుంచి పడి మంచానికే పరిమితమయ్యాడు. దీంతో ఆ నిరుపేద కుటుంబం ఆర్థికంగా అవస్థలు పడుతోంది. విషయం తెలుసుకున్న మణుగూరు జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ వారు బాధితుడిని పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేలను, 50కేజీల బియ్యాన్ని, నిత్యావసర సరుకులను సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు గూడూరు కృష్ణారెడ్డి, సభ్యులు మురళీ, పునాటి పాపయ్య, వారా రామారావు పాల్గొన్నారు.

### క్యాలెండర్ల ఆవిష్కరణ

**మణుగూరురూరల్:** మండల పరిధిలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్-మణుగూరులో తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్(టీజీపీఈఏ) నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్మాగారంలో అధిక విద్యుత్ ఉత్పత్తికి ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. అనంతరం సూపరింటెండెంట్ ఇంజనీర్లు డబ్ల్యూ రమేష్‌బాబు, టి శ్రీనివాసరావులు మాట్లాడారు. టీజీపీఈఏ బీటీపీఎస్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, జెన్‌కో కార్యదర్శి బి.రవిప్రసాద్, టీఎస్ఈఏఈఏ బ్రాంచ్ కార్యదర్శి రవితేజ, రాము, వెంకటేషన్, మహేష్, నరేష్, సాయిరామ్, రషీద్, అఖిలేష్ పాల్గొన్నారు.

### వేలంలో రూ.9.98 లక్షల ఆదాయం

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని వినాయకపురం గ్రామంలో ఉన్న ప్రముఖ చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయం దేవస్థానానికి మంగళవారం నిర్వహించిన వేలం పాటల ద్వారా ఆదాయం సమకూరినట్లు దేవాదాయశాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి.బెయిల్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయం వద్ద వచ్చే మార్చి నెల 26వ తేదీ నుంచి ఏప్రియల్ 1వ తేదీ వరకు జరిగే జాతర ఉత్సవాల సందర్భంగా వివిధ రకాల దుకాణాల ఏర్పాటుకు వేలం పాటలు నిర్వహించగా.. రూ.9.98లక్షల ఆదాయం వచ్చిందని, వీటిలో జాయింట్ వీల్, ఐస్‌క్రీం, శీతలపానీయల దుకాణానికి రూ.9.51లక్షలు, అదే విధంగా కొబ్బరి చిప్పల సేకరణకు రూ.37వేల రూపాయాలకు వ్యాపారులు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. ఈఓ సూర్యప్రకాష్‌రావు, చైర్మన్ నరాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

### కేన్సర్‌పై అవగాహన

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్ గ్రామంలోగల ప్రభుత్వ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల(దమ్మపేట)లో మంగళవారం ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల విద్యార్థినులకు కేన్సర్ వ్యాధి అవగాహన కల్పించారు. గుమ్మడవల్లి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ మధులిక ఆధ్వర్యంలో చేపట్టాన కేన్సర్ వ్యాధి గుర్తింపు, నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.స్పందన, హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### కార్యనిర్వహణ కమిటీ ఎన్నిక

**అశ్వాపురం:** అశ్వాపురం, మణుగూరు మండలాల సరిహద్దులో ఉన్న రేగులగండి గ్రామంలోని లింగమంతుల ఆలయం వద్ద చౌడాలమ్మ సమేత భవాని లింగమంతుల జాతర ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్వహించనున్నారు. జాతర విజయవంతానికి అశ్వాపురం, మణుగూరు మండలాలకు చెందిన యాదవ పెద్దలు జాతర కార్యనిర్వాహక కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మద్ది పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శిగా మంగి మల్లికార్జున్, కోశాధికారిగా తోట శేషయ్య, ఉపాధ్యక్షులుగా కమ్మాల పుల్లయ్య, బొల్లు సతీష్, మంతబొయిన కుమార్, మంతా ప్రవీణ్, కసనబొయిన రాములు, గుంటి మల్లయ్య, దావా వీరస్వామి, రాసాల నరేష్, వెంకటేశ్వర్లు, వలరాజు, సహాయ కార్యదర్శిగా రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా గణేష్, ఏడుకొండలు, శాంతారావు, నగేష్, బాబు, పెదసత్యనారాయణ, గౌరవ అధ్యక్షులుగా వెంకన్న, కురుమల్లు, కొమిరెల్లి, మల్లయ్య, తోటకృష్ణతోపాటు 25 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

# కార్మికులే పర్యవేక్షకులు!

- సీసీ రోడ్ల నిర్మాణాన్ని పట్టించుకోని అధికారులు
- నిర్మాణ నాణ్యతపై అనుమానాలు



సీసీ రోడ్డు పోస్తున్న కార్మికులు

**కరకగూడెం:** గ్రామీణ ప్రాంతాల్లో నిర్మితమవుతున్న సీసీ రోడ్లు గ్రామీణ ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అలాంటప్పుడు ఈ రోడ్ల నిర్మాణ పనులను సక్రమంగా నిర్వహించడం చాలా ముఖ్యం. కాని పలుచోట్ల అధికారులు రోడ్ల నిర్మాణాలను గాలికి వదిలేసినట్లు తెలుస్తోంది.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని పలు గ్రామాలకు నూతనంగా సీసీ రోడ్లు మంజూరయ్యాయి. ఈ క్రమంలో చొప్పల గ్రామంలో మంగళవారం ప్రారంభమైన సీసీ రోడ్డు నిర్మాణ పనులలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా ఏదైనా నిర్మాణ పని జరిగేటప్పుడు అనుభవజ్ఞులైన ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు పనులను పరిశీలిస్తారు. కానీ ఈ చిత్రంలో కార్మికులే పనులు చేస్తూ, పర్యవేక్షిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇది నిర్మాణ నాణ్యతపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. అంతేకాకుండా అధికారులు లేకపోవడం వల్ల కార్మికులకు సరైన సూచనలు అందవు. దీంతో పనుల ఎ అస్తవ్యస్తంగా జరిగే అవకాశం ఉంది. నిర్మాణ పనులు నిర్ణీత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతున్నాయో లేదో పరిశీలించే వారు ఉండరు. అధికారుల నిర్లక్ష్యం వల్ల అనవసరమైన ఖర్చులు అవ్వడానికి అవకాశం లేకపోలేదు. అందులో భాగంగా ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. పనుల పునరావృతం అవ్వొచ్చు. ప్రజల పన్నులతో నిర్మితమవుతున్న రోడ్డు ఇలాంటి నిర్లక్ష్యం వల్ల దెబ్బతింటే.. అది ప్రజలకు పాలకులు, అధికారులు చేసిన అన్యాయం అవుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్మాణ పనులు నిర్ణీత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకుపోవాలని స్థానికులు కోరుతున్నారు.

#### నాణ్యతను విస్మరించవద్దు

సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతున్నప్పుడు అధికారులు నిరంతరం పనులను పరిశీలించాలి. ఉపయోగించే సామగ్రి నాణ్యత పనుల తీరు మొదలైన వాటిని గమనించాలి. ఏవైనా నాణ్యతా లోపాలు కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలి.కాంట్రాక్టర్లు ఎట్టి పరిస్థితిలోనూ నాణ్యత ప్రమాణాలను విస్మరించవద్దు.

– కాంతారావు, సీపీఎం మండల కార్యదర్శి

#### పర్యవేక్షిస్తున్నాం..

నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. అన్ని నియమ, నిబంధనలు వారికి వివరించాం. పనులు జరుగుతున్న సమయంలో మేము ఇతరత్రా పనులు కారణంగా కొన్ని సార్లు అక్కడ ఉండలేకపోతున్నాం. ఎవరైనా పనులు నాణ్యంగా చేయకుంటే వారు సీసీ రోడ్డు కోర్ కటింగ్ ద్వారా దొరుకుతారు.

– వెంకటేశ్వర్లు పంచాయతీ రాజ్ ఏఈ

# ఆగని ఇసుకాసురుల దందా



రవాణాకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

**దమ్మపేట:** రెవెన్యూ అధికారులు హెచ్చరించినప్పటికీ ఇసుక అక్రమ రవాణాను ఆగడం లేదు. ఇసుకాసురులు తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తునే ఉన్నారు. మంగళవారం మండల పరిధిలోని రెడ్యాలపాడు శివారులోని మల్లెపూల వాగులో ఇసుకను అక్రమంగా పదుల సంఖ్యలో ట్రాక్టర్లలోకి లోడ్ చేయించారు. ఈ ట్రాక్టర్లను సత్తుపల్లి, గంగారం తదితర సమీప ప్రాంతాలకు రాత్రి వేళల్లో తరలించడానికి వ్యవసాయ క్షేత్రాల్లో దాచి ఉంచారు. ఆ వాగులోకి ఇతరులు ఎవరినీ ఇసుక అవసరాల కోసం రానీవ్వకుండా, కొందరు మాత్రమే ఇసుకపై పెత్తనం చెలాయిస్తున్నారు. ఈ అక్రమ ఇసుక దందాను అరికట్టడంలో రెవెన్యూ అధికారులు వైఫల్యం చెందారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. వెంటనే ఇసుక దందాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# దెబ్బతిన్న రోడ్ల పరిశీలన



దెబ్బతిన్న రహదారిని పరిశీలిస్తున్న పొదెం వీరయ్య

**దుమ్ముగూడెం:** మండలంలోని గంగోలు, సీతారాంపురం, నర్సాపురం, తూరుబాక గ్రామాల్లో దెబ్బతిన భద్రాచలం-చర్ల ప్రధాన రహదారిని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తక్షణమే మరమ్మతు చర్యలు తీసుకుని, రహదారులను పరిరక్షించాలని జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌లో సూచించారు. ఆర్థికపరమైన సమస్యలు ఉంటే వాటి ఎస్టిమేషన్ జనరేట్ చేసి సమర్పించాలని, తద్వారా ప్రభుత్వం నుంచి నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు.

**ముత్యాలమ్మ జాతరకు హాజరు..**

గ్రామంలోని ముత్యాలమ్మ 23వ జాతరలో అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారికి ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ రెండు కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్, భద్రాచలం పట్టణ అధ్యక్షుడు, పరిమి శ్రీనివాసరావు, టీపీసీసీ మీడియా-కమ్యూనికేషన్స్ జిల్లా కన్వీనర్ కనుబుద్ధి దేవా, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ పూజారి సూర్యచంద్రరావు, శంకర్, నాయకులు పాల్గొన్నారు.

# పార్టీ నాయకులతో సమావేశం



చంద్రుగొండ: రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఎంపీడీఓ అశోక్

**దమ్మపేట:** పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రాజకీయ నాయకులతో ప్రధానంగా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించిన ఓటర్ల జాబితా గురించి చర్చించారు. ఈ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు ఏమైనా ఉంటే, సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రామారావు, పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

**చంద్రుగొండ:** పంచాయతీ ఓటర్ల తుది జాబితాను ఎంపీడీఓ బయ్యారపు అశోక్ ప్రకటించారు. కార్యాలయంలో అఖిలపక్ష పార్టీల నాయకులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. 14 పంచాయతీల్లో 23,893 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పంచాయతల వారిగా త్వరలోనే ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు కొడకండ్ల వెంకటరెడ్డి, దార వెంకటేశ్వరరావు, దారం గోవిందరెడ్డి, పెద్దిని వేణు, నల్లమోతు రఘపతిరావు, బొర్రా కేశవులు, వారాధి సత్యనారాయణ పాల్గొన్నారు.

**అన్నపురెడ్డిపల్లిలో..**

మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ మహాలక్ష్మి పంచాయితీ ఓటర్ల తుది జాబితా విడుదల చేశారు. మొత్తం పంచాయితీల్లో 16,627 ఓటర్లు ఉన్నారని ఆమె ప్రకటించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయపక్షలా నాయకులు పాల్గొన్నారు.

# లక్ష డప్పుల కార్యక్రమంపై ప్రచారం



గుండాల: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

**చంద్రుగొండ:** ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో మంద కృష్ణమాదిగా ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన లక్షడప్పుల మోత కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు చాపలమడుగు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ.. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో డప్పులతో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు చాపలమడుగు రామరాజు, రాములు, నరేష్, ప్రసాద్, పి.వెంకటేశ్వర్లు, సీహెచ్ వెంకటేశ్వర్లు, కె.పుల్లయ్య పాల్గొన్నారు.

**పోస్టర్ ఆవిష్కరణ..**

**గుండాల:** ఈ నెల 7వ తేదీన లక్ష డబ్బులు, వేయి గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కండే రాంబాబు, కార్యవర్గ సభ్యులు కండె వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆళ లపల్లి మండల కేంద్రంలో మంగళవారం అంబేడ్కర్ కాలనీలో గోడ పత్రికలను ఆవిష్కరించి మండల ఎమ్మార్పీఎస్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆళ్లపల్లి మండల సీనియర్ నాయకుడు కండే చిన్న ముత్యం, చిన రామ్మూర్తి, నారాయణ, మోహన్ రావు, ముసలయ్య, లాలయ్య ,పెద్దచారి పుల్లయ్య, కుంపటి రజిత, కోట జయమ్మ, ఇతర నాయకులు పాల్గొన్నారు.


### చట్టాలపై అవగాహన ఉండాలి

**చంద్రుగొండ:** చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలని పారాలీగల్ వాలంటీర్ ఎండి.షాజాహా అన్నారు. మంగళవారం ఆమె ఎంపీడీఓ బయ్యారపు అశోక్‌ను కలిశారు. పారా లీగల్ ద్వారా ప్రజలకు న్యాయ సలహాలు అందిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అర్హులకు అందేవిధంగా పని చేస్తామన్నారు. న్యాయపరమైన కేసులను తమ ఉచితంగా వాదించుకునే అవకాశం ఉందని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చ తెలిపారు.

### 'క్షయ'పై అపోహలు వద్దు

**కరకగూడెం:** క్షయ వ్యాధిపై అపోహలు వద్దని కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రవితేజ సూచించారు. మంగళవారం వెంకటాపురం గ్రామంలో క్షయ వ్యాధిపై ఆయన స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 15 రోజులకు మించి దగ్గు, జ్వరం ఆకలి లేకపోవడం బరువు తగ్గిపోవడం, ఆయాసం, అలసట, తేమడలో రక్తం పడటం, మెడ చుట్టూ, గజ్జలో గడ్డలు వంటివి క్షయ వ్యాధి ప్రధాన లక్షణాలని తెలిపారు. టీబీ అలెర్ట్ ఇండియా డిస్ట్రిక్ కోర్డినేటట్ వెంకటేశ్వర్లు, ఎక్స్ రే టెక్నీషియన్ లహరి, ఎస్టీఎస్ ప్రేమ్ కుమార్, హెచ్ఈఓ పోలెబోయిన కృష్ణయ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# త్రిష మరింత ఎత్తుకు ఎదగాలి



భద్రాచలంఅర్బన్: కేక్‌కట్ చేస్తున్న సీపీఐ నాయకుడు రవికుమార్

**భద్రాచలంఅర్బన్:** ప్రపంచ అండర్ 19 క్రికెట్ కప్ సాధించడంలో ప్రముఖ పాత్ర పోషించిన గొంగడి త్రిష మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, జాతీయ మహిళా ప్రధాన క్రికెట్ జట్టుకు భవిష్యత్తులో ప్రాతినిధ్యం వహించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రవికుమార్ ఆకాంక్షించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో పట్టణ నాయకుడు కంభంమెట్టు శ్రీనివాస్ అధ్యక్షతన త్రిష అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముందుగా కేక్ కట్ చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. భద్రాచలం పట్టణంలో పుట్టి పెరిగి జాతీయస్థాయికి త్రిష ఎదగడం భద్రాచలానికే కాకుండా తెలంగాణకే గర్వకారణం అని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ నాయుడు, మారెడ్డి శివాజీ, శోభన్, సాయి, మహేష్, త్రిమూర్తులు, కొండబాబు, గంగాధర్, సాయిరాం, విజయ్ కుమార్, మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**త్రిషకు శుభాకాంక్షలు..**

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణానికి చెందిన టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ క్రికెటర్ త్రిషతో పాటు ఆమె తండ్రి రామిరెడ్డిని మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని త్రిష నివాసంలో కలిసిన ఆయన.. ఇదే విధమైన ఆట తీరులో భారత మహిళా మెయిన్ జట్టులో చోటు సంపాదించాలని ఆకాక్షించారు.

### బోర్లకు అనుమతి

**చంద్రుగొండ:** పోడుభూముల్లో గిరిజనులు బోరుబావులు వేసుకునేందుకు ప్రభుత్వం జీఓ విడుదల చేసినట్లు కాంగ్రెస్‌పార్టీ మండల నాయకుడు భోజ్యానాయక్ తెలిపారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కృషి మేరకు ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. మంగళవారం ఫారెస్టు రేంజర్ ఎల్లయ్యను కలిసి జీఓ కాపీని భోజ్యా అందించారు. కార్యక్రమంలో నాయకులు బొర్రా సురేష్, బాబులాల్, ఫజల్ బక్షతదితరులు పాల్గొన్నారు.

### తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలు

**సాక్షి నెట్‌వర్క్:** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లోని తుమ్మల అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్త ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు.

### బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలోని బీఆర్ఎస్ నాయకులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం అసెంబ్లీ వద్ద ఆందోళనకు పిలుపునివ్వడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా పట్టణ కన్వీనర్ సునీల్‌తో పాటు పలువురు నాయకులను మంగళవారం తెల్లవారు జామున పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

**గుండాల:** చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ముందస్తు అరెస్టులు చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్లం భాస్కర్, అధికార ప్రతినిధి తిరుకొల్లూరి రాము, గడ్డం వీరన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నిట్ట రాములు, యువజన విభాగం నాయకుడు ప్రమోద్ ఉన్నట్లు వెల్లడించారు.

### సైబర్ నేరాలపై జాగ్రత్త

**ములకలపల్లి:** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి సూచించారు. మండలపరిధిలోని ముత్యాలంపాడు గ్రామంలో ఎస్‌హెచ్‌జీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ వ్యక్తిగత, బ్యాంక్ ఖాతాల వివరాలు తెలుపవద్దని సూచించారు. ఆర్‌బీఐ కౌన్సిలర్ నవీన్‌బాబు, ఎస్‌హెచ్‌జీ సీసీ రమాదేవి. వీఓఏ నాగమణి పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ఇళ్లు ఇవ్వాలి

**చర్ల:** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దివ్యాంగులకు అవకాశం కల్పించి అర్హత గల వారందరికీ ఇళ్లు కేటాయించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి కోరింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ వలీకి దివ్యాంగులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు రేగళ్ల సుధాకర్ మాట్లాడారు. నాయకులు సాగర్, సతీష్, సత్యనారాయణ, కేశవులు, రాజేశ్వరి పాల్గొన్నారు.

### నర్సిరెడ్డిని గెలిపించాలి

**అశ్వారావుపేటరూరల్:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీపీటీఎఫ్ బలపరిచే టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి అలుగుపల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ కె.మాధవరెడ్డి ఉపాధ్యాయులను కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు, వాటి పరిష్కారం పట్ల సమగ్ర అవగాహన ఉన్న అభ్యర్థి నర్సిరెడ్డి అని అన్నారు.

### రైస్ మిల్లుల తనిఖీ

**కరకగూడెం:** మండల కేంద్రంలోని నందీశ్వర, వెంకట కనకదుర్గ రైస్ మిల్లులను సివిల్ సప్లై డీటీ శివకుమార్ మంగళవారం తనిఖీ నిర్వహించారు. మండలంలో రెండు రైస్ మిల్లులకు ధాన్యం ప్రభుత్వం ఇచ్చినట్లు, వాటి నుంచి బియ్యం ఉత్పత్తి ఎంత శాతం పూర్తి అయిందో పరిశీలించినట్లు తెలిపారు. ఆ రైస్ మిల్లులలో నిల్వ ఉంచిన బియ్యాన్ని, వాటి రికార్డులను పరిశీలించారు. త్వరగా ప్రక్రియ పూర్తి చేసి బియ్యం అందించాలని మిల్లర్లకు సూచించారు.

### విద్యతోనే అభివృద్ధి



తిమ్మంపేట కోదండ రామాలయంలో సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

**ములకలపల్లి:** విద్యతోనే సమాజం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు అన్నారు. రథసప్తమిని పురస్కరించుకుని తిమ్మంపేటలోని కోదండ రామాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. పురప్రముఖులు ఊటుకూరి జోగానందం, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి



ఓసీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**మణుగూరుటౌన్:** సెల్ పికింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు నెల నెలా వేతనాలు చెల్లించడంలో జాప్యం నివారించి వేతనాలు సమయానికి అందించడంతో పాటు బ్యాంకుల ద్వారా వేతనం చెల్లించాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కార్యదర్శి ఆదెర్ల సురేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మణుగూరు ఓసీ మేనేజర్ బైరెడ్డి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జెల్లరాపు రమేశ్, ప్రవీణ్, సుమంత్, సారయ్య, ప్రవీణ్‌కుమార్, చిట్టిబాబు ఉన్నారు.

### రాస్తారోకో వాయిదా..

**దుమ్ముగూడెం:** భద్రాచలం నుంచి వాజేడు వరకు ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఈ నెల 5వ తేదీన ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో చేపట్టాలని నిర్ణయించిన రాస్తారోకోను వాయిదా వేసినట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు కొమరం దామోదర రావు, గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణలు తెలిపారు. మంగళవారం ములకపాడు గ్రామంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాస్తారోకో వాయిదా వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సొందె మల్లూరు, ఇర్ప ప్రకాశ్, కల్లూరి రవికిరణ్, ఉబ్బా చంటి, సంపత్, మల్లేష్, నరేంద్ర పాల్గొన్నారు.

### పాలాభిషేకం..

**మణుగూరురూరల్:** జనరంజకంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ సెంటర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంపన సీతారామరాజు మాట్లాడుతూ.. దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆలోచించి బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా రామకృష్ణ, లింగంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్‌కు అనుకూలం..

**ములకలపల్లి:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తూ, కార్మిక, కర్షకులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు నరాటి ప్రసాద్ ఆరోపించారు. ములకలపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా సంయుక్త సమావేశంలో ఆయా పార్టీల నాయకులు ఎండి.యూసఫ్, పోతుగంటి లక్ష్మణ్, ఊకంటి రవికుమార్‌లతో కలిసి మాట్లాడారు. లెఫ్ట్ పార్టీలు నేడు తలపెట్టిన నిరసనను విజయవంతం చేయాలన్నారు. కొర్సా రామకృష్ణ, గౌరి నాగేశ్వరరావు, నిమ్మల మధు, రవీందర్, హరనాథ్ పాల్గొన్నారు.

### వైద్య శిబిరం

**దుమ్ముగూడెం:** మండలంలోని మానుగట్ట గ్రామంలో సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ గ్రామాన్ని సోషల్ ఎంగేజ్మెంట్ అండ్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ దత్తత తీసుకుంది. గ్రామంలోని 242 మందికి పరీక్షలు నిర్వహించారు. కమాండెంట్ రితేష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎస్ఐ గణేష్, ఐతయ్య పాల్గొన్నారు.

# వైభవంగా ఎఫ్‌ఎల్‌ఎన్ బాలమేళా



అశ్వారావుపేటరూరల్: విద్యార్థులకు బహుమతులు అందించిన ఎంఈఓ ప్రసాద్‌రావు

**దుమ్ముగూడెం:** నరసాపురం కాంప్లెక్స్ పరిధిలోని 24 పాఠశాలలో ఎఫ్‌ఎల్‌ఎన్ బాలమేళా-25ను మంగళవారం వైభవంగా నిర్వహించారు. కాంప్లెక్స్ పరిధిలోని సీతారాంపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నరసాపురం కాంప్లెక్స్ పరిధిలోని 24 పాఠశాలలో ఒక పాఠశాలను ఉత్తమ పాఠశాలగా గుర్తించి ఆ పాఠశాలకు ఉత్తమ పాఠశాల అవార్డు ప్రదాన ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ పాఠశాల ఎంపిక కోసం కారంపాడి దశంబాబు ఆధ్వర్యంలో చిగురుమల్ల శ్రీనివాస్, బి.శ్రీనివాస్, కిషన్, ఆశాలతా సభ్యులుగా మండల టీం 24 పాఠశాలలు సందర్శించి రిపోర్టును తయారు చేశారు. కార్యక్రమ పరిశీలకులుగా సూది రెడ్డి నాగిరెడ్డి ఆది లక్ష్మమ్మ మెమోరియల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చిలకమర్రి శ్రీనివాసరావు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల బృందంలో స్ట్రాంగ్ టీచర్ గా వ్యవహరించారన్నారు.

**అశ్వారావుపేటరూరల్:** ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే బాలమేళా కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఉండే సామర్థ్యాలు, వారి ప్రతిభకు తగిన గుర్తింపు వస్తుందని స్థానిక ఎంఈఓ పి.ప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం అశ్వారావుపేట కాంప్లెక్స్ పరిధిలో నిర్వహించే బాలమేళా-2025 కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాలమేళా కార్యక్రమాన్ని కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 11వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు కాంప్లెక్స్ స్థాయిలో, ఆ తర్వాత జిల్లా స్థాయికు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం పి.హరిత, లీలావతి, ఉపాధ్యాయురాలు శారద, సీఆర్‌పీ ప్రభాకరాచార్యులు, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.